క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

మండపేట: ఆధార్ నవీకరణ కోసం ఏర్పాటు చేస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ టీవీ రంగారావు కోరారు. మంగళ, బుధవారాల్లో ప్రకాశం మున్సిపల్ స్కూల్లోని అంగన్‌వాడీ కేంద్రంలోను, 19, 20 తేదీల్లో రావులపేట జనార్దన మున్సిపల్ స్కూల్లోను ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 26, 27 తేదీల్లో సత్యశ్రీ రోడ్డులోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ హైస్కూల్లో, 28న ఏడో వార్డు బాపూజీ మున్సిపల్ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతుందని తెలిపారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌లో 5 అర్జీలు


గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీవో డి.అఖిలకు 5 అర్జీలు అందజేసినట్లు కార్యాలయం అధికారి విలేకరులకు వెల్లడించారు. ఆక్రమణలు తొలగించాలని 3, దివ్యాంగుల పింఛన్ కోసం 1, గ్రామ రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఒక దరఖాస్తు అందినట్లు వెల్లడించారు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు రేపు సన్మానం

మండపేట: పెన్షనర్స్ డేను పురస్కరించుకుని బుధవారం పట్టణంలో 75 ఏళ్లు పైబడిన విశ్రాంత ఉద్యోగులకు సన్మానం చేయనున్నట్టు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్‌బ్యాంకు ఎదురుగా ఉన్న నాళం చినభీమయ్య సత్రంలో మధ్యాహ్నం 3 గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, కమిషనర్ రంగారావు, ఆలమూరుకు చెందిన ఎస్‌టీవో ఎంఏ హైదర్ ఆలీఫాషా అతిథులుగా వస్తారన్నారు. పెన్షనర్లు విధిగా హాజరు కావాలని కోరారు.

ఎస్‌డీజీపై రెండు రోజుల శిక్షణ

కె.గంగవరం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ)పై నేటి నుంచి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన కె.గంగవరంలోని ఐకేపీ కార్యాలయ మీటింగ్ హాల్‌లో నేటి ఉదయం 9 గంటల నుంచి శిక్షణ కార్యక్రమం ప్రారంభం అవుతుందని మండలానికి చెందిన అన్ని గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి చెక్కును సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కె.గంగవరం మండలం బ్రహ్మపురి గ్రామానికి మేడ ఏడుకొండలు అనారోగ్య ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మెరుగైన వైద్యం చేయించుకోవడానికి రూ.30 వేల చెక్కును ఆయనకు అందజేశారు. అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చెట్లకు నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి


నిప్పు పెట్టడంతో కాలిపోయిన చెట్టు

మండపేట: తాపేశ్వరం–అర్తమూరు రహదారికి ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లకు నిప్పు పెట్టి, నాశనం చేస్తున్నారని అర్తమూరు గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి గుమ్మడి అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ రహదారి వెంట ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతూ, పది మందికి నీడనిస్తున్న పచ్చని చెట్లను కొందరు స్వార్థపరులు నిప్పు పెడుతున్నారన్నారు. ఇప్పటికే చాలా చెట్లు కాలిపోయాయని, తాజాగా మరికొన్ని చెట్ల మొదళ్లలో అంటించారని చెప్పారు. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే తాను గ్రీన్స్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

అవిశ్రాంత ప్రయాణం

- సామాజిక బాధ్యతలో విశ్రాంత ఉద్యోగులు
- ఉద్యోగ కాలం ముగిసినా.. చురుగ్గా సేవా కార్యక్రమాలు
- రెండు నియోజకవర్గాల్లో 2,720 మంది
- నేడు పెన్షనర్స్ డే

కపిలేశ్వరపురం: నిండు నూరేళ్లూ జీవించాలన్నది ఆశ. 60వ ఏట వరకూ ఉద్యోగం చేయాలన్నది అవసరం. అనంతరం ఉద్యోగ విరమణ అనివార్యం. ఇలా మానవ జీవితంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో శ్రమించే ఉపాధ్యాయ, ఉద్యోగ, శ్రామికుల జీవన గమనం ఉంటుంది. చిన్ననాట ఆటలాడిన మనిషి వృద్ధాప్యంలో చిన్న పిల్లాడిని తలపిస్తాడు. శరీరం నీరసించి, కుటుంబ సభ్యుల సహాయంపై ఆధారపడతాడు. అంతమాత్రాన ఆ వ్యక్తికి ఏ మాత్రమూ విలువ తగ్గదు. గత కాలపు జీవన గమనాన్ని ఒడిసిపట్టిన అనుభవం, తర్వాత తరానికి అందించేంత శక్తి కలిగిఉంటాడు. ఉద్యోగ జీవనాన్ని మించి ఉద్యోగ విరమణ తర్వాత జీవితం ఉండి తీరుతుంది. ఆ విలువ, గౌరవాలను గుర్తించాల్సిన బాధ్యతను నేటి తరం కలిగి ఉండాల్సిందే. నేడు పెన్షనర్స్ డే సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.

రెండు నియోజకవర్గాల్లో ఇలా..

మండపేట నియోజకవర్గంలోని మండపేట, రాయవరం మండలాల్లో రిటైర్డ్ పెన్షనర్ల సంఘాలున్నాయి. మండపేటలో 700 మంది, కపిలేశ్వరపురం మండలంలో 800 మంది మొత్తం 1,200 మంది ఉన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 1,520 మంది ఉన్నారు. రామచంద్రపురం, రాయవరంల్లో సంఘాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసుకుని, సామాజిక సేవా కార్యక్రమాలనూ చేపడుతున్నారు.

చేయూతనిస్తూ..

ఉద్యోగ విరమణ చేసిన వారికి మండపేట, రామచంద్రపురంల్లోని పెన్షనర్ల సంఘాల నాయకులు అనేక సేవలందిస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన అనంతరం తమ సర్వీసు తాలూకు వివరాలతో పెన్షన్ నిర్ధారణ, ఇతర లావాదేవీలకు సంబంధించిన దరఖాస్తు వ్యవహారాలపై అవగాహన కల్పిస్తున్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, పింఛను పే ఫిక్సేషన్‌లో వ్యత్యాసాలుంటే సరిచేయించడం, వ్యక్తిగత సర్టిఫికెట్లు సమకూర్చడం, ఏటా జీవన ప్రమాణ పత్రాలను సమర్పించడంలో సాయమందిస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లో సైతం..

పెన్షనర్ల సంఘాల ద్వారా రామచంద్రపురం, మండపేటల్లో రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రామచంద్రపురంలోని సంఘ కార్యాలయంలో గత నవంబర్‌లో రెండు విడతలుగా వైద్య, ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. పెన్షనర్స్ డే రోజైన డిసెంబర్ 17న సుమారు 50 మంది చొప్పున సత్కారం చేస్తున్నారు. రామచంద్రపురంలో టీచర్స్ డే రోజున ఉపాధ్యాయులను సత్కరిస్తున్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను నిర్వహిస్తున్నారు. కార్తిక వన భోజనాలను నిర్వహిస్తూ ఐక్యతను చాటుతున్నారు. మండపేట రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 75 ఏళ్లు నిండిన రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం చేస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన పలువురు వ్యక్తిగత బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలలకు సామగ్రిని సమకూర్చడం, పాఠశాలల ఖాతాలకు సొమ్ము డిపాజిట్ చేసి, వాటి వడ్డీతో విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందించడం వంటివి చేస్తున్నారు.

పెన్షనర్స్ డే నేపథ్యమిదీ..

బ్రిటిష్ కాలంలో ఉద్యోగికి సంపూర్ణ హక్కులు పెద్దగా ఉండేవి కావు. వ్యవసాయం గౌరవప్రదంగా భావించడంతో ఉద్యోగావకాశం వచ్చినా, ఆనాటి చదువరులు ఉద్యోగంలో చేరేందుకు ఆసక్తి చూపేవారు కాదు. సంఖ్య రీత్యా పరిమితంగా ఉండటంతో వారిలో ఐక్యత కూడా అత్యల్పంగానే ఉండేది. ఆ నేపథ్యంలో ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పెన్షన్ అనేది అత్యల్పంగా ఉండేది. 1889లో పెన్షన్ విధానం ప్రారంభమైనప్పటికీ, అది కేవలం నామమాత్రంగా ఉండేది. 1920 బ్రిటిష్ కాలంలో రిటైర్డ్ బెనిఫిట్ పెన్షన్ ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యానంతరం మూడు దశాబ్దాల తర్వాత ఢిల్లీ మిలటరీ అధికారి డీఎస్ నకారా పెన్షన్ కోసం దశలవారీ పోరాటం చేశారు. పెన్షన్ సానుభూతిలో ఇచ్చేది కాదని, అది రాజ్యాంగబద్ధ హక్కుగా గుర్తించాలంటూ న్యాయ పోరాటం చేశారు. పలు పోరాటాల అనంతరం ఏపీ రివైజ్డ్ పెన్షన్ రూల్స్–1980 అమల్లోకి వచ్చాయి. 1981లో కుటుంబ పెన్షన్ అమల్లోకి వచ్చింది. అంతిమంగా 1982 డిసెంబర్ 17న అప్పటి సుప్రీం కోర్టు న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్ తీర్పు చెప్పారు. ఆనాటి నుంచి జాతీయ స్థాయిలో పెన్షనర్స్ డేను జరపడం ప్రారంభించారు. ఆ తీర్పు చెప్పిన వైవీ చంద్రచూడ్ ఇటీవల సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన ధనంజయ యశ్వంత్ చంద్రచూడ్ తండ్రి. పెన్షన్ హక్కు కోసం పోరాడిన డీఎస్ నకారా 2009లో మరణించారు. ఆయనకు నివాళి అర్పిస్తూ విశ్రాంత ఉద్యోగుల సంఘాలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.


మండపేటలో రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి (ఫైల్)

సర్వీసులో ఉన్నట్టుగానే..



నేను, మా సహచర రిటైర్డ్ ఉద్యోగులమంతా ఉద్యోగ విరమణ చేశామన్న భావనతో ఉండటం లేదు. సర్వీసులో ఉన్నప్పటి ఉత్సాహంతోనే సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం. సహచర ఉద్యోగులతో పాటు, వారి కుటుంబ సభ్యుల బాగోగుల్లో సాయమందిస్తున్నాం. రోజురోజుకూ మారుతున్న పెన్షన్ రూల్స్‌ను అధ్యయనం చేస్తూ, ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి వారి ప్రయోజనాల కోసం సలహాలు ఇస్తున్నాం.

– పట్నాల రామకృష్ణారావు, అధ్యక్షుడు. రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం, రామచంద్రపురం

సామాజిక కార్యకర్తగా..



నేను గత నెల నవంబర్‌లో ఉద్యోగ విరమణ చేశాను. ఉద్యోగ బాధ్యతల నుంచి తొలగినప్పటికీ, సామాజిక కార్యకర్తగా సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నాను. ఆ దిశగా సామాజిక అంశాలను అధ్యయనం చేస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారి హక్కుల కోసం చేసే ఉద్యమాలకు సహకరిస్తున్నాను. ఆ కార్యాచరణలో సంతృప్తిగా ఉంది.

– డీవీ రాఘవులు, రిటైర్డ్ టీచర్, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం మండలం

రూ.79.25 కోట్లతో మండల బడ్జెట్ ఆమోదం

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మండపేట: వివిధ కేటాయింపులతో రూ.79.25 కోట్ల వార్షిక అంచనా బడ్జెట్‌ను మండపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమోదించింది. ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ప్రత్యేకాధికారి ఓ.రామకృష్ణ, ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి, ఏవో వీఎస్ ప్రసాద్, వైస్ ఎంపీపీలు పసుమర్తి నాగేశ్వరరావు, గజ్జి వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2024–25 సవరణ బడ్జెట్‌తో పాటు, 2025–26కు రూ.79,25,72,450 అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. ఈ బడ్జెట్‌ను ఎంపీపీ శ్రీనివాస్ సమావేశంలో ప్రవేశపెట్టగా, సభ్యుల అంగీకారంతో ఆమోద ముద్ర వేశారు. మిగులు బడ్జెట్‌ను రూ.99,550గా చూపించారు. అనంతరం మండలంలో అభివృద్ధి చర్యలను అధికారులు వివరించారు. మండపేట–ఏడిద రోడ్డులో ప్రయాణం నరకంగా మారిందని సర్పంచ్‌లు వరదా చక్రవర్తి, బూరిగ ఆశీర్వాదం చెప్పారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ, నియోజకవర్గంలో పాడైన రోడ్లను బాగుచేస్తామన్నారు. అధ్వానంగా ఉన్న ఇప్పనపాడు–మెర్నిపాడు రహదారి బాగు చేయించాలని కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాన్ కోరారు. ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణారావు మాట్లాడుతూ, కేశవరం గ్రామంలోని పల్లపు వీధిలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం అధికారులను కోరినా, ఫలితం లేదన్నారు. ద్వారపూడి ఏఈ రవికుమార్ మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో కొందరు ట్రాన్స్‌ఫార్మర్ వేసే చోట అభ్యంతరం తెలుపుతున్నారని చెప్పగా, సమస్య లేకుండా చూసుకుంటానని కృష్ణారావు తెలిపారు. ఏఈ ఏసుబాబు మాట్లాడుతూ, రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ రవికుమార్ మాట్లాడుతూ, సోలార్ పేనల్ సిస్టం ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అర్తమూరు గ్రామాన్ని మోడల్ విలేజీగా ఎంచుకున్నామని తెలిపారు. డాక్టర్ జగదీప్ మాట్లాడుతూ, మండలంలో క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని, మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తహసీల్దార్ తేజేశ్వరరావు మాట్లాడుతూ, రైల్వే ఫ్లైఓవర్‌లను జెడ్ మేడపాడు, కేశవరం గ్రామాల్లో నిర్మించేందుకు గత ప్లాన్‌లో మార్పులు చేసి, ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించామన్నారు. దీనిపై ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, కేశవరం ఆర్వోబీని గ్రామంలో పోతురాజు చెరువు గండిపై నుంచి నిర్మించి రాకపోకలు సులభతరం చేయాలని కోరగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో సమస్యలపై అర్జీలు


నిడసనమెట్ట సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: నిడసనమెట్ట, వడ్లమూరు గ్రామాల్లో సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో రైతులు తమ భూములకు సంబంధించిన సాంకేతిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అర్జీలను అందజేశారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు మాట్లాడుతూ రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామాల వీఆర్వోలు దరఖాస్తుల్లో పొందుపర్చిన సాంకేతిక సమస్యలను తహసీల్దార్ చిన్నారావు దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రెవెన్యూ అనుబంధ ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు


మాచర గ్రామ సభలో ఉపాధి పనులను వివరిస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉపాధి పనులను పారదర్శకంగా చేపడుతున్నట్టు సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ కనకారావు తెలిపారు. మాచరలో సోమవారం ఉపాధి గ్రామసభ నిర్వహించారు. ఈ నెల 21న కపిలేశ్వరపురంలో మండల స్థాయి సామాజిక తనిఖీ వేదికను నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. సర్పంచ్ వాసంశెట్టి సునీత అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులపై చర్చించారు. ఎస్ఆర్‌పీ ఇ.కనకరావు పర్యవేక్షణలో డీఆర్‌పీ శ్యామ్ సామాజిక తనిఖీలోని ప్రధాన అంశాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, ఉప సర్పంచ్ అడపా వేణు, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ పి.రజిత్‌సింగ్, టెక్నికల్ అసిస్టెంట్ జె.లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ శివకుమార్, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

ఎవరి కోసం.. ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ?

మొక్కుబడిగా అధికారుల హాజరు


కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి మొక్కుబడిగా హాజరైన అధికారులు

కె.గంగవరం: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తారు. దానికి మండంలోని అన్ని శాఖల అధికారులు హాజరై వారి శాఖకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు ఇస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారు. వెంటనే పరిష్కారమయ్యే వాటిని అప్పటికప్పుడే చేయాలి. లేదంటే సమయం పట్టే సమస్యలకు నిర్ణీత గడువు చెప్పి పంపుతారు. అయితే కె.గంగవరం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి అధికారులు హాజరు కాకుండా దుమ్మా కొట్టారు. ఆ అధికారులకు విధులపై ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోంది. కొందరు అధికారులు వారి కార్యాలయంలోని సిబ్బందిని పంపి మమ అనిపిస్తున్నారు. సమస్యలు అడిగితే వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత గల అధికారులు రాకుండా కిందిస్థాయి సిబ్బంది సమస్యలపై ఏం బాధ్యతగా సమాధానం చెబుతారనేది అందరికీ తెలిసిన విషయమే. అధికారులే హాజరు కాకపోతే ఇక సమస్యలు పరిష్కరించేదెవరని కార్యక్రమానికి మండల ప్రజలు దూరంగా ఉంటూ సమస్యలు ఉన్న వారి కలెక్టర్ నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి డబ్బులు వెచ్చించి హాజరై తమ సమస్యలు వెళ్లబోసుకుంటున్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి అధికారులు రాకపోయినా, మొక్కుబడిగా నిర్వహిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వ పెద్దలకు ప్రజా సమస్యలపై ఎంత మక్కువో అర్థమవుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. కింది స్థాయి అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారో లేదో కూడా తెలుసుకోలేని స్థితిలో డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి అధికార యంత్రంగా ఉంది. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో కింది స్థాయి అధికారులు వారి సొంత పనుల్లో బిజీ అయిపోతున్నారని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం బయోమెట్రిక్, ఫేషియల్, ఐరిష్ ఇలాంటి ఎన్నిపెట్టినా అధికారుల్లో మాత్రం ఇసుమంతైనా మార్పు రాలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు పనితీరుపై జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పశువులకు దోమపోటు

తగ్గుతున్న పాల దిగుబడి


దోమల నుంచి పశువుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన దోమ తెరలు

కాజులూరు: పశువులకు దోమపోటు కారణంగా పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరి వ్యవసాయ ఆధారిత మండల గ్రామాల్లో అధిక శాతం రైతులు వరి సాగు చేయడంతో పాటు పశువులను మేపుతుంటారు. వరి పంట నుంచి వచ్చే అదనపు ఉత్పత్తులను పశువులకు దాణాగా వాడుతుంటారు. అయితే ఇటీవల కాలంలో పశువులకు దోమ పోటు బెడద అధికమైంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దోమల ఉధృతి అధికమయింది. మండల గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ లోపం కారణంగా పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి రోజుల తరబడి నిలిచిపోయింది. ఈ మురుగు నీటిలో దోమలు పెరిగి అవి పశువులపై దాడి చేస్తున్నాయి.

దీంతో ఎంత ఖరీదైన దాణా ఇచ్చినప్పటికీ పాల దిగుబడి తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. పశువులను దోమ పోటు నుంచి కాపాడుకునేందుకు వాటి శరీరంకు రోజూ వేప నూనె పూయడం, పశువుల కాళ్ల వద్ద పొగపెట్టడం వంటి చర్యలతో పాటు పశువుల స్థావరాలపై రైతులు దోమతెరలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది శ్రమతోను, అధిక వ్యయంతోను కూడుకున్నది కావడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అయినప్పటికీ పాల దిగుబడి రోజురోజుకి తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు. దీంతో కొందరు రైతులు తమ పశువులను అయినకాడికి అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి వేపనూనె, దోమ తెరలను రైతులకు ఉచితంగా సరఫరా చేసి పశువులను దోమ పోటు బారి నుంచి, రైతులను ఆర్థిక ఇబ్బందుల బారి నుంచి రక్షించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

జల్‌జీవన్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన


జల్‌జీవన్‌మిషన్ పైప్‌లైన్ పనులు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో రూ.166.50 లక్షల నిధులతో చేపట్టనున్న జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా 6.5 కిలోమీటర్ల పైపులైన్ పనులకు సోమవారం మహదేవుడి ఆలయం వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు బండి కుమారి, డేగల వెంకటరమణ, కాలుకురవ ఏడుకొండలు, యండమూరి ఈశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హై టెన్షన్

- ఇళ్ల పైనుంచి 33 కేవీ విద్యుత్ వైర్లు
- దీర్ఘకాలంగా పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో కేశవరం ఇందిరమ్మ కాలనీవాసులు


దేవుడు తాళ్ల కాలనీ ఇంటి పైనుంచి వెళ్లిన విద్యుత్ వైర్లు

మండపేట: మండలంలోని కేశవరం గ్రామంలో జనావాసాలపై నుంచి వెళ్లిన విద్యుత్ వైర్లు యమపాశాలను తలపిస్తున్నాయి. దీర్ఘకాలంగా వైర్లు ప్రమాదభరితంగా ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

గ్రామంలోని దేవుడు తాళ్ల ప్రాంతంలో 2007లో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటైంది. కాలనీ ఏర్పాటుకు ముందు నుంచీ ఆ ప్రాంతం మీదుగా బొమ్మూరు–ద్వారపూడి విద్యుత్ సబ్‌స్టేషన్లకు చెందిన హైటెన్షన్ లైన్లు కాలనీ మీదుగా వెళ్లాయి. క్రమంగా ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పెరగడంతో నివాసితుల సంఖ్య ఎక్కువైంది. ఇంటి శ్లాబ్ పైన చేతికి తగిలే ఎత్తులో వైర్లు ఉండడంతో అపాయకరంగా మారాయి. విద్యుత్ వైర్లు తగలడంతో కాలనీకి చెందిన కొందరు ఇప్పటికే ప్రమాదాల బారిన పడ్డారు. ఓ బాలుడు ఆరు నెలలుగా మంచం పట్టాడు. ఒక వ్యక్తి కాలు పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కొందరు ఇంటి శ్లాబుపైకి వెళ్లడాన్ని మానుకున్నారు. మెట్లకు అడ్డుకట్టలు కట్టేసుకున్నారు. ఇళ్ల పైన ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలంటూ ఏళ్ల తరబడి అధికారులను మొత్తుకుంటున్నా పట్టించుకున్న నాథుడే లేదు.

తరచూ సంభవిస్తున్న ప్రమాదాలు



దేవుడు తాళ్ల కాలనీలో ఇళ్ల పైనుంచి వెళ్లిన విద్యుత్ వైర్ల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక సార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకోవడం లేదు. సమస్య పరిష్కారం తమ పరిధిలో లేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

– సుందరరావు, ఇందిరమ్మ కాలనీ వాసి, కేశవరం

గాలి వేస్తే భయమేస్తోంది



విద్యుత్ వైర్లు ఇంటి పైనుంచి వెళ్తుండడంతో బలమైన గాలులు వీచినపుడు, వర్షం కురిసినపుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని భయంతో బతుకుతున్నాం. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– షేక్ అమ్మాజీ, స్థానికురాలు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాను



పరిష్కారం కోసం ఈ సమస్యను 2007 నుంచి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాను. విద్యుత్ లైన్ ఏర్పాటు చేశాక కాలనీ ఏర్పాటు కావడంతో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం సమస్యగా మారింది. ఇప్పటికైనా అధికారులు తగిన విధంగా స్పందించాలి.

– తుపాకుల ప్రసన్నకుమార్, మాజీ ఎంపీటీసీ

ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై రెండు రోజుల శిక్షణ

రామచంద్రపురం రూరల్: ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక 2025–26 సంవత్సరానికి సుస్థిరమైన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నేడు, రేపు(17, 18 తేదీల్లో) శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.పద్మజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండ్రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరం, ఎంఈఓ కార్యాలయాల్లో రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

క్రీస్తు వాక్యాలు శాంతికి మార్గాలు

కాజులూరు: ఏసుక్రీస్తు వాక్యాలు ప్రపంచ శాంతికి మార్గదర్శకాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఉప్పుమిల్లిలో సోమవారం జరిగిన మండల పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభలో ఆయన మాట్లాడుతూ భూమిపై మనుషులలో పాపుల పాపాలను హరించేందుకై ఏసు మనిషిగా జన్మించాడన్నారు. కార్యక్రమంలో భాగంగా రాజబాబు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొమ్ము రాజబాబు సౌజన్యంతో సమకూర్చిన దుప్పట్లు, బట్టలు పలువురు పేదలకు మంత్రి పంపిణీ చేశారు. సంఘ కాపరులు ఆనంద కుమార్, సంతోష్, పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.